ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 21 అక్టోబరు 2024



మెట్లదారిలో చెట్టు తొలగింపు

మల్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లె మెట్లదారి మార్గంలో దారికి అడ్డంగా పడిన చెట్టును దేవస్థానం అధికారులు తొలగిం పచేశారు. నెల రోజుల క్రితం దారిలో అడ్డంగా చెట్టు పడడం, భక్తులు నడిచివెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో శనివారం ఆంధ్రజ్యోతిలో 'కొండెక్కేదెట్లా' శీర్షికన కథనం రావడంతో ఈవో రామకృష్ణరావు చెట్టు తొలగింపుకు చర్యలు తీసుకున్నారు. శని వారం సాయంత్రమే దాన్ని తొలగించి రహదారిని పునరుద్దరించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

8

మూసీ సుందరీకరణకు రూ. 1,50,000 కోట్లా..?

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

8

పెండింగ్ బిల్లులు, డీఏలు వెంటనే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్ రావులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో వారు మాట్లాడుతూ తమ అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్, సంపాదిత సెలవు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తో పాటు సప్లిమెంటరీ వేతనాల బిల్లులు సంవత్సరం దాటినా మంజూరు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు అయిల్నేని నరేందర్‌రావు, రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్సీకి సన్మానం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం శ్రీరాంనగర్, చెర్లకొండాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ నుంచి శ్రీరాం నగర్ ఎల్లమ్మ ఆలయం వరకు రూ.కోటి 50 లక్షల నిధులు, చెర్లకొండాపూర్ నుంచి మైతాపూర్ వరకు రూ.కోటి 6 లక్షల నిధులు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసినందుకు ఎమ్మెల్సీని వారి నివాసంలో కలిసిన ఆయా గ్రామాల ప్రజలు సన్మానించి హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే


కొడిమ్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చెప్యాల గ్రామంలో కరాటె నేర్చుకుంటున్న సుమారు 20 మంది విద్యార్థులను ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అభినందించారు. ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట మల్యాల మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు మహిపాల్‌రెడ్డి, కరాటే కోచ్ బరిగె లక్ష్మీరాజం ఉన్నారు.

పాదయాత్రకు స్వాగతం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా నుంచి హైదరాబాద్ వరకు చేపడుతున్న తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్రకు జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేష్, మలిదశ ఉద్యమ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ హరి అశోక్ కుమార్, గంగాధర్ స్వాగతం పలికారు.

క్రిప్టో దందా

- పెట్టుబడి కోసం ఆస్తుల తాకట్టు
- బంగారం, ప్లాట్లు, కార్లు అమ్ముకుంటున్న మధ్యతరగతి జనం
- అత్యాశకు పోయి... అవస్థలు పడుతున్న వైనం
- రూ. కోట్లలో లావాదేవీలు... వందల్లో బాధితులు



జగిత్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన ఓ మధ్య తరగతి వ్యాపారి భార్య, ఇద్దరు పిల్లలతో ఉన్నదాంట్లో సంతృప్తిగా బతుకుతున్నాడు. ఆ కాలనీలోని ఓ నేత సుమారు ఆరు నెలల క్రితం కలిశాడు. ఫలానా ఆన్‌లైన్ దందా బాగుంది...నేను చాలా పెట్టుబడి పెట్టాను.. లాభాలు వస్తున్నాయి...నువ్వు కూడా పెట్టు...ఎలాంటి టెన్షన్ లేదు.. అంతా తాను చూసుకుంటా..అంటూ తన లాభాల లెక్కలు మొబైల్ చూపించాడు. వచ్చిన వ్యక్తి సమాజంలో వైట్ కాలర్‌గా చలామణి అవుతుండడం వల్ల ఆ మాటలు నమ్మాడు. సదరు వ్యాపారి తొలుత రూ. లక్ష పెట్టుబడి పెట్టాడు. కొద్ది వారాల తర్వాత రూ. 5 నుంచి 10 లక్షలు పెడితే నెలకు రూ. ఒక లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు వస్తాయని చెప్పడంతో తనకున్న ఓ ప్లాటును విక్రయానికి పెట్టి వచ్చిన అడ్వాన్స్ డబ్బులను మరీ పెట్టుబడి పెట్టాడు. సొంత వ్యాపారం మానేసి ఆన్‌లైన్ దందాలో మునిగాడు. ఇటీవల ఒక్కసారిగా సదరు ఆన్‌లైన్ యాప్ పనిచేయకపోవడంతో కంగు తిన్నాడు. తనను నమ్మించిన సదరు నేతకు కాల్ చేస్తే ఫోన్ ఎత్తడం లేదు. మరోవైపు చైన్ లింక్ పద్ధతిలో తాను డబ్బులు కట్టించిన వారు గంటకోమారు కాల్ చేసి ఒత్తిడి తెస్తున్నారు. ఏం చేయాలో తోచని పరిస్థితిలో సదరు మధ్య తరగతి కుటుంబం అల్లాడుతోంది. ఇలా ఒక్కరు, ఇద్దరు కాదు...వందల సంఖ్యలో అత్యాశకు పోయి తమ శక్తికి మించి అప్పులు చేసి మరీ ఆన్‌లైన్ దందాల్లో పెట్టుబడులు పెట్టారు. కనీసం సదరు వ్యాపారాల గురించి ఆరా తీయకుండా రూ. లక్షల్లో పెట్టేశారు. తీరా వాటి గురించి ఇప్పుడిప్పుడు తెలుస్తుండటంతో ఒక్కొక్కరుగా కుమిలిపోతున్నారు.

జగిత్యాలలో జోరుగా..

జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గల పలు గ్రామాలు, మండలాల్లో కొన్ని నెలలుగా క్రిప్టో దందా జోరుగా జరుగుతోంది. రూ. కోట్లలో లావాదేవీలు జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. పదుల సంఖ్యలో మార్కెట్‌లో చలామని అవుతున్న పలు యాప్‌లలో పెట్టుబడులు పెట్టి వందల సంఖ్యలో బాధితులు లబోదిబోమం టున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఏ నలుగురు కలిసినా జరుగుతున్న చర్చ ఒక్కటే...ఆన్‌లైన్ వ్యాపారంలో నేను ఇంత పెట్టాను...నువ్వు ఎంత పెట్టావు అని. ఇలా ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టిన వారు ఎదుటి వారిని ప్రభావితం చేసేందుకు పని గట్టుకొని ప్రచారం చేస్తున్నారు. క్రిప్టో కరెన్సీకి చెందిన పదుల సంఖ్యలో గల యాప్ బ్లాక్ చైన్ దందాలు మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ మోసపూరిత దందాలో పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు గడించవచ్చనే కేటుగాళ్ల మాటలతో నిత్యం ఎంతో మంది సామాన్యులు దందాల వైపు ఆకర్షితులవుతున్నారు. అప్పులు చేసి దందాలో పెట్టుబడులు పెట్టి మోసానికి గురవుతున్నారు.

శక్తికి మించి డబ్బులు పెట్టి....

జిల్లాలో యూబిట్ తతంగం బయటకు వచ్చిన తర్వాత ఆన్‌లైన్ కథలు ఒక్కక్కటిగా వెలుగు లోకి వస్తున్నాయి. ఈ దందాలో ఎక్కువగా మధ్య తరగతి కుటుంబాలు, వ్యాపారులు, యువత, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రియల్ వ్యాపారులు ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఇలాంటి కుటుంబాలు ఈ దందాలో తమ శక్తికి మించి పెట్టుబడులు పెట్టాయి.

ఆన్‌లైన్ చైన్ దందాలతో లబోదిబో..

పేరు ఏదయినప్పటికీ ఆన్‌లైన్ చైన్ దందాలన్నీ ఒకేలా పనిచేస్తున్నాయి. మొదట్లో ఆకాశానికెత్తే లాభాలు చూపుతాయి. మెల్లగా చైన్ లింక్ దందాలో ఇరికిస్తాయి. ఇక నువ్వు కూడా ఓ అయిదుగురి చేస్తేనే నీకు లాభాలు వస్తాయి. అనే పరిస్థితికి తీసుకువస్తాయి. అధిక లాభాలు వస్తాయ న్న అత్యాశతో రూ. లక్షల్లో పెట్టిన పెట్టుబడితో పాటు ఎం తో కొంత లాభాలను పొందాలని ఆ దందాల్లో కూరుకు పోతున్నారు. తాజాగా జిల్లాలో బయటపడిన యూనిట్ బిజినెస్‌లో ఇలా ఇరుక్కుపోయిన వాళ్లే ఎక్కువగా ఉన్నారు. ఇందులోనూ అధికశాతం మధ్య తరగతి కుటుంబాలవారే. గతంలోనూ చాలా ఆన్‌లైన్ దందాలు ఎన్నో కుటుంబాలను రోడ్డుపాలు చేశాయి.

తరువాయి 8వ పేజీలో..

వినూత్న ప్రచారం

జగిత్యాల సమీకృత కలెక్టరేట్‌లో బెలూన్ ఏర్పాటు



లెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బెలూన్

జగిత్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలపై రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రచారం చేస్తోంది. నిత్యం వందలాది మంది వచ్చే జగిత్యాల సమీకృత కలెక్టరేట్‌లో సంక్షేమ పథకాలను వివరించేలా బెలూన్లు ఏర్పాటు చేశారు. సబ్సిడీ గ్యాస్ పథ కాన్ని వివరించేలా ఉన్న బెలూన్‌ను కలెక్టర్ చాంబర్ వైపు వేళ్లే దారిలో ఏర్పాటు చేశారు. ఈ బెలూన్‌పై ఆరు గ్యారంటీలతో ఇందిరా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫొటోలు ఉన్నాయి. ఇన్నాళ్లు బెలూన్లలో ఆక్సిజన్ నింపుతుండగా...విద్యుత్ కనెక్షన్‌తో రూపం సంతరించుకునే సిలిండర్ బెలూన్‌ను కలెక్టరేట్‌కు వచ్చేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జగిత్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాంబజారులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో డాక్టర్ పల్లా అలేఖ్య హాజరై సుమారు 130 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. జగిత్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి జగదీశ్, కోశాధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మల్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాపూర్, బల్వంతాపూర్‌లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంగని రవి, నాయకులు అనంతరెడ్డి, మహేందర్, నవీన్ పాల్గొన్నారు.

కళాశాల ప్రారంభం గొప్ప విషయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల (ఓరియంటల్) పునః ప్రారంభం గొప్ప కార్యక్రమమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళాశాలకు సంబంధించి నూతనంగా ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా నియామకమైన ఆరుగురు బోధన సిబ్బందికి నియామకపు పత్రాలను ఆదివారం ఆయన అందించారు.

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో మంత్రిగా పని చేసి కొప్పుల ఈశ్వర్ ఈ ప్రాంతాభివృద్ధి గురించి ఏనాడు ఆలోచించలేదన్నారు. ప్రజలకు హానీ చేసే ఇథనాల్ ప్రాజె క్టుకు శంకుస్థాపన చేస్తే అందుకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తే అక్రమ కేసులు నమోదు అయ్యాయన్నారు. కళాశాల మరమ్మతు పనులకు ఏసీడీపీ నిధుల నుంచి రూ 5 లక్షలు కేటా యించామన్నారు. త్వరలో కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం గురించి కలెక్టర్‌తో మాట్లాడు తానని తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల సెక్రటరీ సంగనభట్ల రామకిష్టయ్య, ప్రిన్సిపాల్ డా క్టర్ ప్రభాకర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి చేప పిల్లల పంపిణీ

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో చేప పిల్లలను పోశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ విజయభారతి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు క్యాదాసు నవీన్, బాలె లత, పద్మ, జుంబర్తి రాజ్ కుమార్, పంబాల రామ్ కుమార్, బాల ముకుంద, గంగపుత్ర సంఘం నాయకులు ఆరుముల్ల గంగారాం, జుంబర్తి శంకర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మార్గమే జీవనానికి ఆధారం

పిరమిడ్ యోగ శిక్షకురాలు పద్మావతి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో ధ్యానమార్గమే ప్రజల జీవనానికి ఆధారం అవుతుందని ప్రముఖ పిరమిడ్ యోగా శిక్షకురాలు ఒంగోలు పద్మావతి అన్నారు. పట్టణంలో జరిగిన పిరమిడ్ ధ్యాన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు, యువకులు ధ్యాన మార్గాన్ని ఎంచుకొని జీవహింసను విడనాడాలని పిలుపునిచ్చారు. సజ్జన సాంగత్యంతోనే ధ్యాన జగత్తులో జీవితాన్ని పునీతం చేసుకోవాలన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం సృష్టికర్త పత్రీజీ చూపిన బాటలో ప్రజలందరూ నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ నెల 27న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే శాకాహార మహా ర్యాలీ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిరమిడ్ మాస్టర్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

వెల్గటూర్ అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కట్రావ్ పేట గ్రామానికి చెందిన కుస మొండయ్య (46) రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతూ ఈ నెల16న పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత



జగిత్యాలలో ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జగిత్యాల క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. వర్షాకాలం పంటకు రైతు భరోసా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత మాట్లాడుతూ అధికారం కోసమే ఆరు గ్యారంటీ పథకాలను తీసుకవచ్చారే తప్ప అమలు చేయడం లేదన్నారు. సన్న రకం ధాన్యంతో పాటు అన్ని రకాల ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, నాయ కులు శీలం ప్రియాంక ప్రవీణ్, తుమ్మ గంగాధర్, లక్ష్మణ్ రావు, ఆనందరావు, మల్లేశం ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారిపై బైఠాయించి జరిపి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రహదారి ఇరువైపుల వాహనాలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ గంగుల మహేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని కార్యకర్తలతో ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, డీసీ ఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆకుల రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

● రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులతో పా టు అన్ని వర్గాలను నయవంచనకు గురి చేసిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా మాటల గారడీతో గత ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుందన్నారు.

గుర్తుకొస్తున్నారు..

- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల అవిశ్రాంత పోరాటం
- నేడు పోలీసు అమర వీరుల దినోత్సవం



పోలీసులు గతంలో ఏర్పాటు చేసిన అమరవీరుల ఫ్లెక్సీ

జగిత్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో గతంలో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు పోలీసులు అమరులయ్యారు. పోలీసు ఉద్యోగమంటే ప్రాణాలతో చెలగాటం, సాహసాలతో సహవాసం. ఇవి తెలిసి కూడా పోలీసు శాఖలో చేరడానికి పలువురు గొప్పగా భావిస్తుంటారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరించుకోవడానికి పోలీసు శాఖ ప్రతియేటా అమరు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈనెల 15వ తేది నుంచి 21వ తేది వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రక్తదానం, వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ పోటీలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు.

●1959 సంఘటన నేపథ్యంతో..

దేశ సరిహద్దు లడఖ్ అక్సాయ్‌ఇన్ సమీపంలో చైనా బలగాలు 1959 అక్టోబరు 21వ తేదిన దాడులకు దిగాయి. చైనా బలగాల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు జరిగిన హోరాహోరి పోరులు 12 మంది సీఆర్‌పీ జవాన్లు మృతి చెందారు. వారి వీరత్వాన్ని గుర్తుగా 1960 సంవత్సరం నుంచి ప్రతీయేటా అక్టోబరు 21వ తేదిన పోలీసుల అమరు వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నారు.

●బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి అధికారుల కృషి..

విధి నిర్వహణలో అమరులైన బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ఒక వైపు ప్రభుత్వం, మరోవైపు అధికారులు కృషి చేస్తున్నారు. పోలీసు అమర వీరుల కుటుంబాలకు అధికారులు వివిధ రకాలుగా సహాయం అందిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి బాధిత కుటుంబాల పిల్లలు చదువుకోవడానికి ఫీజుల రాయితీ, ఉచిత విద్యనం దిస్తున్నారు.

●పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

అశోక్ కుమార్, ఎస్పీ



విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల సేవలు చిరస్మరణీయము. అమరుల యాదికై ప్రతీయేటా వారం రోజుల పాటు అమరవీరుల వారోత్సవాలను పోలీసు శాఖ తరపున నిర్వహిస్తున్నాము. బాధిత కుటుంబాల సంక్షేమానికి అనవరమైన కృషిని చేస్తున్నాము.

జమ్మికుంట.. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా గుర్తింపు ఉన్న పట్టణం.. రైల్వే లైన్ ఉండడంతో ఈ పట్టణానికి ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు వచ్చి స్థిరపడ్డారు. సరుకు రవాణా సులభంగా అవుతుండడంతో ఈ మార్కెట్‌కు ఉత్తర తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. నిజాం హయాంలో 1944లో మార్కెట్‌ను ప్రారంభించారు. వందల్లో ప్రారంభమైన లావాదేవీలు ప్రస్తుతం కోట్ల రూపాయలకు చేరాయి. మార్కెట్ విస్తరణ పలు దశల్లో జరిగింది. దాన్యం, అపరాలతో ప్రారంభమైన మార్కెట్‌లో క్రమంగా పత్తి అమ్మకాలు ఊపందుకున్నాయి. ఇప్పుడు పత్తి అమ్మకాలకు కేరాఫ్‌గా మారింది. ఈ మార్కెట్‌ను నమ్ముకుని వెయ్యి మంది ఉపాధి పొందుతున్నారు.

జమ్మికుంట కొత్త మార్కెట్ ప్రధాన ముఖ ద్వారం



తెల్ల బంగారానికి c/o జమ్మికుంట మార్కెట్

జమ్మికుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణకే తలమానికంగా నిలిచి రైతులు, వ్యాపారులు, కార్మికులు, కర్షకులు ఇలా ఎంతో మందికి ఉపాధిని కల్పించి జమ్మికుంట ప్రాంత అభివృద్ధిలో కీలకంగా నిలిచింది. వేలాది మంది కార్మికులకు ఉపాధి ఇవ్వడంతోపాటు వ్యాపారుల ఎదుగుదలకు తోడ్పాటును అందించింది. జమ్మికుంట అభివృద్ధికి వెన్ను దన్నుగా నిలిచిన వ్యవసాయ మార్కెట్ ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని నిలిచింది.

1944లో ప్రారంభం

జమ్మికుంట పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌ను 1944లో నెలకోల్పారు. 1950లో నిర్మించిన మార్కెట్ భవనాన్ని అప్పటి హైద్రాబాద్ సంస్థాన ప్రధానమంత్రి ఎంకే వెల్లోడి ప్రారంభించారు. మార్కెట్ యార్డు 9.32 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఆ సమయంలో ఆపరాలు, పల్లికాయ, ధాన్యం విక్రయాలు మాత్రమే జరిగేవి. పట్టణంలో నాలుగు ఆయిల్ మిల్లులు ఉండేవి. ఈ ప్రాంతంలో క్రమేణా పత్తి పంట సాగు పెరిగింది. మార్కెట్‌కు పత్తి రాక పెరగడంతో ధాన్యం, ఆపరాలకు చోటు సరిపోలేదు. దీంతో పత్తి విక్రయాల కోసం ప్రతేకంగా నూతన మార్కెట్ యార్డు నిర్మించాలని అప్పటి పాలకులు భావించారు. 2003లో కోట్లాది రూపాయాలు వెచ్చించి 16.28ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు నిర్మించారు. అప్పటి మంత్రి ముద్దాసాని దామోదరరెడ్డి మార్కెట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి పాత మార్కెట్ యార్డులో ధాన్యం, అపరాలు, కొత్త మార్కెట్ యార్డులో పత్తి విక్రయాలు సాగిస్తున్నారు.



నాడు కనీసం రెండు రోజులు.. నేడు గంటల్లోనే..

జమ్మికుంట పట్టణంతో పాటు పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కమలాపూర్, మొగుళ్లపల్లి, చిట్యాల, వీణవంక, హుజూరాబాద్, సైదాపూర్ ఇలా అనేక ప్రాంతాల నుండి ఎడ్ల బండ్లపై రైతులు అప్పట్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడకు తీసుకువచ్చే వారు. నిత్యం నలభై వేల వరకు పత్తి బస్తాలు విక్రయానికి వచ్చేవి. తెల్లవారు జామున తమ వ్యవసాయ ఉత్పత్తులతో మార్కెట్‌కు వచ్చిన రైతులు మరుసటి రోజు తెల్లవారు జాము వరకు అక్కడే ఉండేవారు. తూకాలు అయిపోగానే రసీదు పట్టుకోని అడ్తీదారు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్లే సరికి రాత్రి అయ్యేది. వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకుని ఇంటికి చేరుకోవాలంటే రైతులకు కనీసం రెండు రోజుల సమయం పట్టేది. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతు తన సరుకులు విక్రయించుకోని గంటల వ్యవధిలోనే తిరిగి ఇంటికి చేరుకుంటున్నాడు. రవాణా సౌకర్యం మెరుగు పడడం, ఆన్‌లైన్ తూకాలు, ఆన్‌లైన్ పేమేంట్లతో రైతులకు అవస్థలు తప్పాయని చెప్పవచ్చు.

70 ఏళ్ల ఘన చరిత్ర

- ఏటా లక్షల క్వింటాళ్ల సరుకుల క్రయ విక్రయాలు
- వందల కోట్ల టర్నోవర్

ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం

జమ్మికుంట మార్కెట్లో ప్రతి ఏటా లక్షలాది క్వింటాళ్ల ధాన్యం, పత్తి విక్రయాలు జరుగుతుంటాయి. వందల కోట్ల టర్నోవర్ జరుగుతుంది. పత్తి, ధాన్యం కొనుగోళ్లపై వ్యాపారులు మార్కెట్‌కు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ పరిధిలో ఉన్న 17 గోదాములు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రతి ఏటా 40 లక్షలు, ట్రేడింగ్ లైసెన్స్‌ల రెన్యూవల్స్ కలిపి ప్రతి ఏటా ఆరు కోట్ల నుంచి ఏడు కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. 2013లో 10 కోట్ల రూపాయల ఆదాయంతో ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. జమికుంట మార్కెట్‌తో ప్రత్యక్షంగా వెయ్యి మంది, వందల సంఖ్యలో పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. లైసెన్స్ ఉన్న వ్యాపారులు 72 మంది ఉన్నారు.

- **ఉద్యమాలకు కేంద్రం**

వ్యవసాయ ఉత్పత్తులను విక్రయానికి తీసుకు వచ్చే రైతులు ఉదయం 6గంటల లోపు యార్డుకు రావాల్సి ఉంటుంది. ఐదు నిమిషాలు ఆలస్యమైనా మార్కెట్ మెయిన్ గేట్ మూసేవారు. దీంతో కిలో మీటర్ల మేర వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయి ఉండేవి. మధ్యాహ్నం వరకు గేట్లు తీయని సందర్భాల్లో రైతులు తీవ్ర అసహానానికి లోనై నిరసనలు చేపట్టేవారు. వ్యాపారులు నాణ్యత పేరిటా పత్తి ధరల్లో అధిక తేడాలు వేసిన సందర్భాల్లో రైతులు ఆగ్రహావేశాలకు లోనయ్యేవారు. మెయిన్ గేట్‌కు తాళం వేసి, కార్యాలయంలో అధికారులను నిర్బంధించేవారు. పలు మార్లు మార్కెట్ ఫర్నిచర్ ద్వంసం చేసిన ఘటనల్లో రైతులపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ధాన్యం కోసం గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, కొత్త మార్కెట్లు ఏర్పాటయినా జమ్మికుంట మార్కెట్ తన ప్రత్యేకతను చాటుకుంటుంది.



మార్కెట్‌కు వచ్చిన పత్తి (ఫైల్)

క్రైం కార్నర్

కృష్ణా నదిలో మునిగి యువకుడి మృతి

- సీతంపేటలో విషాదం



వేణుగోపాల్(ఫైల్)

ఇల్లందకుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు దైవ దర్శనానికి వెళ్లి కృష్ణా నదిలో మునిగి మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. గ్రామస్థులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట గ్రామానికి చెందిన పోతన రాజేంద్రం-సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్(38) ఈ నెల 17న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలోని దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న కృష్ణా నదిలో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి మునిగిపోయాడు. రెండు రోజులుగా నది పక్కనే బ్యాగ్ ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు గాలింపు చేపట్టగా సంఘటన స్థలం నుంచి 40 కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ బ్యాగు చోరీ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్ రాజయ్య బ్యాగు శనివారం రాత్రి చోరీకి గురైంది. హైదరాబాద్ నుంచి పెద్దపల్లికి వచ్చిన రాజయ్య కమాన్ వద్ద బస్సు దిగి ఎదురు చూస్తుండగా, ఆటోలో ముగ్గురు వ్యక్తులు వచ్చి రాజయ్య చేతిలో ఉన్న బ్యాగు లాక్కెళ్లారు. ఇంతలో రాజయ్యను పికప్ చేసుకునే వ్యక్తి రాగానే దుండగులు వెళ్లిన దారిని వెంబడించారు. క్రిసెంట్ స్కూల్ వద్ద ఆటోను పట్టుకోగా ఆటోలో ఉన్న వ్యక్తులు పారిపోయారు. బ్యాగులో భూములకు సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని, నగదు లేదని తెలిపారు. పోలీసులు ఆటోను పోలీస్‌స్టేషన్లో ఉంచారు. పట్టణానికి చెందిన డ్రైవర్ రెహాన్ ఆదివారం పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసుకుంటానని హంగామా చేశాడు. తన ఆటోను ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై లక్ష్మణ్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇంట్లో ఉన్న బంగారం మాయం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో దాచిన బంగారం చోరీకి గురయ్యింది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేష్ భార్య శ్యామల దసరా పండుగ సందర్భంగా ఆభరణాలు ధరించి తర్వాత దాచిపెట్టింది. గురువారం తెరిచి చూడగా మొత్తం ఆరు తులాల బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. అయితే బాధితులు ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి

- గొర్రెల కాపరికి గాయాలు

మానకొండూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి గొర్రెలను కారు ఢీకొన్న ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన సంచార జీవి సాయిలు గొర్రెలను పచ్చునూర్ వైపు నుంచి లలితాపూర్ వైపు తరలిస్తున్నాడు. ఆ సమయంలో మానకొండూర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న కారు లలితాపూర్ గ్రామ శివారులో గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల కాపరి సాయిలుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ సాయిలును కరీంనగర్‌కు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి పట్టివేత



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్ మిలీనియం క్వార్టర్స్ సమీపంలో గంజాయి సేవిస్తున్న మార్కండేయకాలనీకి చెందిన అక్రమ్, ఆసీఫ్‌లను పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి 80గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. గోదావరిఖని పట్టణంలో గంజాయి, డ్రగ్స్ లేకుండా చేయలనే ఉద్దేశంతో మూడు కేసుల్లో 16 కిలోల గంజాయిని పట్టుకోవడమే కాకుండా 24 మందిని అరెస్టు చేశామన్నారు. మరో 43 మందిని కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని సీఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఏఎల్ఎంకు గాయాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేగుర్తిలో ఆదివారం విద్యుదాఘాతంతో ఏఎల్ఎంకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేగుర్తిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ పనిచేయడం లేదనే రైతుల సమాచారం మేరకు ఏఎల్ఎంలు శ్రీకాంత్, అమర్‌లు అక్కడికి వెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా చేసే ఏబీ స్విచ్ఛాఫ్ చేయాల్సిందిగా ఏఎల్ఎం అమర్‌కు శ్రీకాంత్ చెప్పాడు. అమర్ ఏబీ స్విచ్ఛాఫ్ చేయకముందే శ్రీకాంత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. రైతులు వెంటనే చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్‌ను ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వి గంగాధర్, డీఈ రాజం, ఏడీఈ రఘు, బొమ్మకల్ ఏడీ అనిల్‌కుమార్ పరామర్శించారు. చాతిపై చర్మం కాలిపోయిందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

ఎల్ఎండీలో పడి యువకుడి మృతి



సాయికుమార్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యువకుడు దిగువ మానేరు జలాశయంలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. యువకుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బూర సాయికుమార్(29) హైదారాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్నట్లు తండ్రికి ఫోన్‌చేసి చెప్పిన సాయికుమార్ రాత్రి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం మహాత్మానగర్‌లోని శ్రీతాపాల నరసింహ స్వామి ఆలయం సమీపంలో దిగువ మానేరు జలాశయంలో సాయికుమార్ మృతదేహం ఉన్నట్లు తండ్రికి సమాచారం అందింది. అప్పటికే సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నరేష్, లక్ష్మీనారాయణ మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం సాయికుమార్‌దిగా గుర్తించారు. శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన సాయికు మార్ నీటిలో పడి మృతి చెందాడని తండ్రి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వీణవంక, పాలకుర్తి, ఇల్లందకుంట మండలాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీణవంక మండలం ఇప్పలపల్లిలో జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ, పాలకుర్తి మండలం పుట్నూర్‌లో మనోవేదనతో వివాహిత, ఇల్లందకుంట మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

- **అనారోగ్యంతో బాధపడుతూ..**

వీణవంక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఉరివేసుకుని ఓ మహిళా ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గువ్వల సంగీత(33) చొప్పదండిలోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. పదేళ్ల క్రితం సంగీత భర్త కొండయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అనంతరం కూతురు కిరణ్మయితో పాటు సంగీత తన తల్లిగారి ఊరు ఇప్పలపల్లిలో ఉంటోంది. రెండునెలలుగా సంగీత అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లోని పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు సంగీత తల్లి ఆకునూరి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

- **మనోవేదనకు గురై..**



చెలిమేటి సంధ్య(ఫైల్)

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుట్నూర్‌లో ఆదివారం ఉదయం ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పుట్నూర్ గ్రామానికి చెందిన చెలిమేటి సంధ్య(32) అనే వివాహిత సంవత్సరం నుంచి ఫిట్స్ మానసిక వ్యా ధి తో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చనిపోయింది. మృతురాలు సంధ్య అన్న ముడిమడుగుల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త సత్యనారాయణ, కూతురు వాసవి ఉన్నారు.

బావిలో దూకి వృద్ధురాలు..

ఇల్లందకుంట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు శనివారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కనుమల్ల భూమమ్మ(82) రెండేళ్ల క్రితం కాలు జారి కింద పడగా తొంటి విరిగింది. కొంత మేర నయమైనప్పటికీ నొప్పితో అవస్థలు పడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి ఇల్లందకుంట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భూమమ్మ బంధువు సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

-ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్ల ఎంపికకు విశేష స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. సుడా చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు.

ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా ఖో-ఖో పోటీలను నిర్వహించి ప్రతిభచాటిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు వంగపల్లి సూర్యప్రకాశ్, సీఐ కుమారస్వామి, కట్ట సంతోష్, ఎస్‌కే మొయిను ద్దీన్, శివకుమార్, గెల్లు మధుకర్, సంధ్య, కరుణాకర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఖో-ఖో సంఘం ప్రతినిధులు

మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి..

- క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న ఇదిలాపూర్ యువకుడు
- డొమెస్టిక్ క్రికెట్ క్లబ్ లెవెల్‌లో ఎంపికైన సాహిత్ కుమార్



తల్లిదండ్రులతో బాల్త సాహిత్ కుమార్

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇదిలాపూర్‌కు చెందిన బాల్త సాహిత్ కుమార్ డొమెస్టిక్ క్రికెట్ క్లబ్ లెవెల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.. శ్రీలంకలో జరిగే అండర్-19 క్రికెట్ పోటీలకు బాల్త సాహిత్ కుమార్ ఈనెల 26న కొలంబోలో జరిగే అంతర్జాతీయ క్లబ్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా ఆడనున్నాడు. సాహిత్ కుమార్ తండ్రి గ్రామంలో వ్యవసాయంతో పాటు చిన్న హోటల్ నడిపిస్తున్నాడు. యూకేజీ నుంచి పదో తరగతి వరకు ముత్తారం గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యాలయంలో చదివాడు. ఇంటర్మీడియెట్ హన్మకొండ లాల్ బహదూర్ కాలేజీలో పూర్తిచేసి, హైదరాబాదులో లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్నాడు. సాహిత్ కుమార్‌కు క్రికెట్‌పై ఆసక్తిని గుర్తించిన తండ్రి రవీందర్ హైదరాబాదులోని నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీలో కోచింగ్‌లో చేర్పించాడు. కోచింగ్ తీసుకుంటూనే పూణే, బెంగళూరు, చెన్నై, టి20, వన్ డే క్రికెట్ మ్యాచ్‌ల్లో పాల్గొని తన సత్తా చాటుకున్నాడు. దీంతో నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ శ్రీలంకలోని కొలంబోలో జరిగే ఇంటర్నేషనల్ అండర్-19 డొమెస్టిక్ క్లబ్ లెవెల్ క్రికెట్ పోటీలకు సాహిత్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న పోటీలకు సాహిత్ కుమార్ హాజరుకానున్నాడు. మారుమూల గ్రామం నుంచి ఇంటర్నేషనల్ పోటీలకు సాహిత్ కుమార్ ఎంపిక కావడంతో ఇదిలాపూర్ గ్రామంతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంతర్జాతీయ క్రికెటర్ గా ఎదగాలని నా కోరిక

- బాల్త సాహిత్ కుమార్

అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదగాలని నా కోరిక. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. హైదరాబాద్ నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటూ చెన్నై, పూణే, బెంగళూరులో జరిగిన పోటీల్లో ఆల్ రౌండర్‌గా పాల్గొని బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చానని, నా ప్రతిభను చూసి నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ అండర్ 19 విభాగంలో శ్రీలంకలోని కొలంబోలో జరుగునున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేసింది. మా నాన్న రవీందర్ వ్యవసాయంతో పాటు హోటల్ నడుపుకుంటూ క్రికెట్‌లో నాకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- గోదావరిఖని ఏసీపీ రమేష్
- ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ మడత రమేష్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో స్పోర్ట్స్ కరాటే హెడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ స్కూల్ గేమ్స్ జోనల్ లెవల్ కరాటే టోర్నమెంట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పిల్లలు చిన్న నాటి నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో జ్ఞానం పెరగడంతో పాటు శారీరధారుఢ్యం పెరుగుతుందని, పైచదువులకు వెళ్లేటప్పుడు క్రీడలు ఉపయోగపడుతాయన్నారు. చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు క్రీడా సర్టిఫికెట్ల కోటాలో సీట్లు సాధిస్తున్నారని, అంతేకాకుండా ఉద్యోగాల్లో కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వస్తున్నాయని ఆయన వివరించారు. గోదావరిఖనిలో కరాటే పోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను ఏసీపీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, తగరపు శంకర్, రాజిరెడ్డి, పసునూటి శంకర్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

● రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


నవంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు అండర్-14 బాలికల విభాగంలో మనస్విని, అద్విత, శ్రీవర్షిణి, సహస్ర, శృశిత, సహస్ర, శాన్వి, ముక్తశ్రీ, శ్రీనిధి, సహస్ర, సుల్తానా, అండర్-14 బాలుర విభాగంలో మణిదీప్, శ్రీరాజ్, సాయి, కుర్షిద్, చౌహాన్, విశ్వక్‌సేన్, రిశ్వంత్, అబ్దుల్ ముజీబ్, రిషికేష్, సూర్య ప్రభాష్ ఎంపికయ్యారు.

'కాలనీ'లో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగింది. అండర్-14 బాలుర విభాగంలో పెద్దపల్లి జట్టు కరీంనగర్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ గెలుపొందింది. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు పెద్దపల్లి జట్టుపై గెలిచింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జక్కుల దామోదర్‌రావు హాజరయ్యారు. స్పందన మోడల్ స్కూల్ నిర్వహించిన ఈ పోటీలకు వివిధ జిల్లాల పాఠశాలల పీఈటీలు, ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

వేములవాడ నాంపల్లి గుట్ట వద్ద ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులు, సందర్శకులను ఆకట్టుకుంటుంది. చుట్టూ పచ్చని పొలాలు.. మూలవాగు, మానేరు వాగుల ప్రవాహం.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి. ప్రధానంగా గుట్ట మధ్య భాగంలో కాళీయమర్ధనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.



నాంపల్లి గుట్టపైన ఏర్పాటు చేసిన కాళీయమర్ధనం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. గుట్టపైన మూడు నామాల రూపంలో లక్ష్మీనృసింహస్వామి ప్రతిమ వెలిసింది. ఆ ప్రతిమకు కుడివైపున హనుమంతుడి ప్రతిమ ఉంటుంది. చోళుల కాలం నుంచి స్వామివారికి పూజలు జరుగుతున్నట్లు ఆధారాలు చెబుతు న్నాయి. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులకు ఆహ్లాదం పంచుతుంది. గుట్ట చుట్టూ పచ్చటి పంటపొలాలు, మూలవాగు, మానేరు వాగుల ప్రవాహం.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి.

● గుట్టపై కాళీయమర్దనం

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003లో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు కాళీయమర్ధనాన్ని నిర్మించారు. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రనృసింహస్వామి విగ్రహంతోపాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని నాగ దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు. నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్ల చొరకల్లో ఉన్న ధర్మగుండం సుమారు వెయ్యి ఏళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టలతో లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజ సిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతోపాటు పలు విగ్రహాలు ఉన్నాయి.

- ● నాంపల్లి గుట్టపై లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం
- ● ప్రకృతి రమణీయంగా ఆలయ పరిసరాలు
- ● ప్రత్యేక ఆకర్షణగా కాళీయమర్ధనం


నాంపల్లి గుట్ట పైనుంచి కనువిందు చేస్తున్న మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ వ్యూ

● పార్శ్వనాథుడు, హన్మంతుని ప్రతిమలు

నవనాథ సిద్దులు (తొమ్మిది మంది) ఈ గుట్టుపై తపస్సు చేసి సిద్ధి పొందారని, నిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని చేరుకొని పూజలు చేసేవారు. అందులో 12వ శతాబ్దానికి సంబంధించిన జైనమతానికి చెందిన పార్శ్వనాథుని ప్రతిమ బండరాయిపై కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గుట్టకు నాలుగు వైపుల పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.

వీటీడీఏ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు



నాంపల్లి గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం వీటీడీఏ (వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి ప్రాధికర సంస్థ) ఆధ్వర్యంలో నాంపల్లి గుట్ట అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఊహచిత్రాలు విడుదల చేసింది. నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉంటుంది. దీంతో నాంపల్లి గుట్టపైకి రోప్‌వే నిర్మాణం, ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు, ధర్మగుండాల సుందరీకరణ, వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ధ్యానమందిరం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం చొరవ తీసుకొని నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని భక్తులు, సందర్శకులు కోరుతున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- హడలిపోతున్న ప్రజలు


రుద్రంగి ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

రుద్రంగి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో వీధికుక్కలు యథేచ్ఛగా స్వైర్యవిహారం చేస్తున్నాయి. రుద్రంగిలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. కుక్కల బెడద విపరీతంగా పెరగడంతో చిన్నారులతో పాటు పెద్దవారు భయాందోళనకు గురవుతున్నారు. నెలల తరబడి కుక్కల సమస్య వెంటాడుతున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. చికెన్ సెంటర్లు, ఫ్రై సెంటర్లు వాటికి సంబంధించిన వ్యర్థాలను రోడ్లపై పాడేయడంతో వీధి కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోయింది. రాత్రివేళలో వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనలపై వెళ్లే వాహనదారులపై కుక్కలు వెంట పడటంతో చాలా మంది ప్రమాదాలకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల ఇందిరాచౌక్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై కుక్కల గుంపు వెంట పడటంతో కాలు విరిగింది.

కొన్ని ప్రాంతాల్లో పిచ్చికుక్కలు చిన్నారులపై దాడి చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో పాఠశాల నుంచి వచ్చే విద్యార్థుల వెంటపడడంతో భయాందోళనకు గురవుతున్నారు. దీంతో చిన్నారులు అరుపులు వేయడంతో కుక్కలను తరిమేందుకు స్థానికులు కర్రలు పట్టుకుని తరమడంతో అవి పారిపోయాయి అని గ్రామస్థులు తెలిపారు. పిచ్చికుక్కలు తిరగడంతో చిన్నారుల ను బయటకు పంపేందుకు ఆందోళనకు గురికావాల్సి వస్తోందని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని కోరుతున్నారు. గ్రామంలో కుక్కలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి


అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారంతపు సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా సంకటహార చతుర్థి పూజలు


స్వామి వారలకు హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, స్థానిక వేదపండితులు మదు రామశర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య లోక కళ్యాణార్థం శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరో హితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు సాయికుమార్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, పాల్గొన్నారు.

పశువులపై హైనా దాడులు

- ఆందోళనలో రైతులు



చిగురుమామిడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమామిడి, సుందరగిరి, నవాబుపేట, ముూదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల పశువులపై హైనా దాడులు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి కాలంలో చిగురుమామిడి, నవాబుపేట గ్రామాల్లో హైనా దాడిలో పశువులు మృతి చెందాయి.

అధికారులు సంఘటన జరిగిన సందర్భంలోనే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారని, అనంతరం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పశువులు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపో తున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందజేయాలి..
- ఎలగందలు రాజు, రైతు సుందరగిరి

మండలంలో హైనా దాడులు చేసి పశువులను హతమార్చుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. బాధిత రైతులకు పరిహారం కూడా అందడం లేదు. అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించాలి. హైనా దాడిలో పశువులు మృతి చెందిన రైతులకు పరిహారం అందజేయాలి.

జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి

-రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పతకాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. ఆదివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులకు జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ యోగా క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందించి అభినందించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ఊనాలో జరిగే జాతీయ యోగాసన చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. 8-10 సంవత్సరాల విభగంలో డి కృపా సూరజ్, 10-12 విభాగంలో బి సాకేత్, ఎన్ ఆదిత్య, 12-14 విభాగంలో పి దీపక్, టి హర్షిత్, బాలాజీ, 14-16 విభగంలో బి ఇందుప్రియ, 16-18 విభాగంలో పి అభికుమార్ జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల యోగా కోచ్ వి కిష్టయ్య, ఆనంద్, కుమార్, కోటేశ్వర్‌రావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

-ఎస్‌ఈ గంగాధర్

కరీంనగర్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ కేబుల్ తెగిపోవడంతో నాలుగు గ్రామాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'రైల్వే కేబుల్ తవ్వుతుండగా కరెంటు వైర్లు కట్' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఎస్‌ఈ స్పందించారు. చేగుర్తిలో ఏఎల్ఎం శ్రీకాంత్ విద్యుదాఘాతంతో గాయపడటంతో ఎస్‌ఈ గంగాధర్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గుంటూరుపల్లి వద్ద తెగిపోయిన అండర్ గ్రౌండ్ కేబుల్‌ను తనిఖీ చేశారు. కేబుల్ మరమ్మతు పనులను పూర్తి చేసి సోమవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ఎస్‌ఈ వెంట ఏడీ రాజాం, ఏడీఈ రఘు, ఏఈ అనిల్ కుమార్‌లు ఉన్నారు.

నీరు ఎత్తి పోసేదెప్పుడో..?

నిరుపయోగంగా కొత్తపేట ఎత్తిపోతల పథకం

262 ఎకరాలకు సాగునీరు

వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు


కొత్తపేటలోని ఎత్తిపోతల పథకం

రాయికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాయికల్ మండలం కొత్తపేటలో భూములను సస్యశ్యామలం చేసేందుకు 2003-04 సంవత్సరంలో రూ.26 లక్షల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉండటంతో యంత్రాలన్నీ తుప్పు పట్టిపోయాయి. దీంతో ఎత్తిపోతల ద్వారా వ్యవసాయం చేయలేక రైతులు బావులపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ మండలం కొత్తపేటలో రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్‌రావు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో 262 ఎకరాలు ఎత్తిపోతల పథకం ద్వారా సాగయ్యేవి. ఈ పథకం పనిచేయకపోవడంతో రైతులకు సరిపడా సాగునీరు లేకపోవడంతో మామిడి పంటలపై దృష్టి సారించారు. ఈ గ్రామంలో ఎస్సారెస్పీ నీరుసైతం సరిగా రాకపోవడంతో కేవలం వ్యవసాయ బావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్ఎస్ హయాంలో మంత్రులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి..
మాదం రమేష్, కొత్తపేట



గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. మా గ్రామంలోని 262 ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతలు ప్రారంభించాలి.

యంత్రాలు పని చేయడం లేదు..
బత్తిని రాజేశం, తాజా మాజీ సర్పంచ్



మా గ్రామంలోని ఎత్తిపోతల పథకం యంత్రాలన్నీ తుప్పు పట్టాయి. సాగునీటి కోసం జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయగా, దీనిని పట్టించుకునే నాథుడే లేడు. మా గ్రామంలో ఎస్సారెస్పీ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభించాలి.

తమ్ముడి చేతిలో అన్న హతం

ఆస్తి తగాదాలే కారణం


సాయిలు(ఫైల్)

మల్లాపూర్, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఆస్తి కోసం సొంత అన్ననే తమ్ముడు హతమార్చిన ఘటన ఆదివారం కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒబులాపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలు(34)ను తన తమ్ముడు చంద్రి ఆదివారం హత్య చేశాడు. సాయిలు కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి ఆరు నెలల క్రితమే స్వగ్రామానికి చేరుకున్నాడు. తల్లిదండ్రులు ఆస్తి పంపకాలు చేయకపోవడంతో ఇంటి సమీపంలో నడక దారి విషయంలో అన్నదమ్ములిద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అన్న సాయిలుపై తమ్ముడు చంద్రి కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సాయిలు బయటకు వెళ్లటాన్ని గమనించిన తమ్ముడు ఇంట్లో నుంచి కత్తి తీసుకుని అతడి వెనకాలే వెళ్లాడు. కొద్ది దూరం వెళ్లాక కత్తిలో సాయిలు తల నరికి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కోరుట్ల రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులపేట గ్రామంలో రాక్ స్టార్, రెడ్డి యూత్ ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పర్యవేక్షణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా విశేష స్పందన లభించింది. వైద్యురాలు తేజ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించగా సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించి ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాస్కర్‌రెడ్డి, రాక్ స్టార్ యూత్, రెడ్డి సంఘ సభ్యులు చిటిరెడ్డి, నారాయణరెడ్డి, శేఖర్ రెడ్డి, గంగారెడ్డి, సాయి, రాకేష్, అంబటి మౌనిధర్, అనుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ మహిళ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా 'రాచకొండ'

కోరుట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీసీ మహిళ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోరుట్ల పట్టణానికి చెందిన రాచకొండ రోజాను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ నియామక పత్రం అందజేశారు. హైదరాబాదులో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు ఆర్ కృష్ణయ్య సమక్షంలో రోజాను జిల్లా బీసీ మహిళ సంక్షేమ సంఘ అధ్యక్షురాలుగా ప్రకటిస్తూ నియామక పత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన జాతీయ నాయకుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బీసీ యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్, అధ్యక్షురాలు బం డపల్లి మల్లేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సూర్యోదయ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల వెలువడిన డీఎస్సీలో ఉపాధ్యాయు లుగా నియమితులు కాగ ఆదివారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివిన గంగుల శివ 5వ ర్యాంక్ సాధించగా, తస్నీయ 16వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారిని కరస్పాండెంట్ రాజ్ కుమార్, డైరెక్టర్ చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపాల్ విజయ కుమారిలు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో


రాయికల్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాయికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఇవ్వమని ఎగవేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆదివారం రాయికల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరును ఎండగట్టాలని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేష్, సమన్వయ కమిటీ సభ్యులు కొండపల్కుల రత్నాకర్‌రావు, వేణు, గంగారాం, అల్లీపూర్ పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సర్పంచ్‌ల పోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, రైతు సంఘ నాయకుడు, మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ కాశిరెడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్, ఎఖీన్‌పూర్, పైడిమడుగు, చిన్న మెట్‌పల్లి సింగిల్ విండో చైర్మెన్‌లు నర్సరెడ్డి, అధిరెడ్డి, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నాయకులు ఆందళనలకు దిగారు. ప్రభుత్వం రైతులను అదుకోవడానికి తక్షణమే రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు, పాల్గొన్నారు.

కథలాపూర్ : కథలాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. వేములవాడ -కోరుట్ల రహదారిపై దాదాపు అరగంట సేపు రాస్తారో కో చేపట్టారు. మాజీ వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, మాజీ ఎం పీటీసీ మామిడిపల్లి రవి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు బంగారుకాళ్ల కిషోర్, గంగాధర్, శ్రీనివాస్, తేజ, హన్మండ్లు, రవి, పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలో బిఆర్ఎస్ నాయకుల నిరసనలు బగ్గుమన్నాయి. రాయపట్నం-కరీంనగర్ జాతీయ రహదారిపై నిరసనలు వెల్లువెత్తాయి. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, భరత్, రంగు తిరుపతి, బందెం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


కోరుట్లలో..

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ఇందిర చౌక్ వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు రైతు భరోస నిధులను, 2 లక్షల రుణమాఫీ, వరికి బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు దశరత్‌రెడ్డి, సత్యనారయణ, జగన్‌రావు, తుక్కారాం, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ధర్మపురిలో ..

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్యాల: రైతులకు రైతురుణమాఫీ, రైతు భరోసా వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ మల్యాలలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నూకపల్లి సింగిల్‌విండో చైర్మన్ మధుసూధన్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, దేవరాజం, నర్సయ్య ప్రవీన్, అజర్, అనిల్ రెడ్డి, గడ్డం రాజేశం పాల్గొన్నారు

బుగ్గారం: మండలంలో బీఆర్ఎస్ నాయకుల నిరసనలు భగ్గుమన్నాయి. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్ మాజీ మండల అధ్యక్షుడు సీర్నెనేని మల్లేశం, మండల యూత్ అధ్యక్షుడు కట్ట రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. వానాకాలంలో ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ నేరెళ్ల సుమన్, మెరుగు రాజేశం పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని మహిళల ఆందోళన

జాతీయ రహదారిపై రాస్తారోకో..

కోరుట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రకాశం రోడ్డులోని ప్రదాన రహదారిని అభివృద్ధి పరచాలని డిమాండ్ చూస్తూ ఆదివారం కార్గిల్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై కాలనీకి చెందిన మహిళలు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. కాలనీకి అను సందానంగా ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలావస్తకు చేరుకోని తరచుగా రోడ్డు ప్రమాదాలో చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తిరిగి వాటిని వేరే పనులకు మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు వాడారని ఆరోపించారు. కాలనీకి వచ్చే స్కూల్ వ్యానులతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలు డ్రైవర్లు పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని అన్నారు. అధికారులు ఇప్పడికైన రోడ్డును నిర్మాణం చేసి ప్రమాదాల నివారణకు సహకారం అందించాలని మహిళలు డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మహిళలను సముదాయించి అందోళన విర మింప జేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం రోడ్డుకు చెందిన మహిళలు పాల్గొన్నారు.


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు

5వ పేజీ తరువాయి..

● వాళ్లను చూసే..

పలువురు వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, అధికారులే నేరుగా యూనిట్ దందాలో ఉండటమే జిల్లాలో వేగంగా విస్తరించడానికి కారణం. గతంలో చాలా ఆన్‌లైన్ దందాలు నిర్వాహకులు చేసి నట్లే.. ఇందులోనూ సమాజంలో కొంత పేరుండి, వాళ్లు చెబితే పది మంది వింటారు. అనే వాళ్లనే ఎంచుకున్నారు. ప్రధానంగా గ్రామాల్లో పలువురు ఉద్యోగులు, నేతలు, పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగులు, అధికారులు, వైద్యులు ఇలా...కొన్ని ప్రభావిత వర్గాలను ఎంచుకుని వారిపైనే పూర్తిగా ఫోకస్ పెట్టి మరీ చేర్చుకున్నారు. వారు కూడా అత్యాశకు గురై ఈ దందాలోకి రావడంతో వీరిని నమ్మి మిగిలిన వారంతా చేరుతూ వచ్చారు.

● అయిదుగురిని అరెస్టు చేసిన పోలీసులు..

జగిత్యాలలో రిక్సోస్ ట్రేడ్ యాప్ అను ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్ ద్వారా యూఎస్‌డీటీ బీఈపీ20 అను క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టండి..మీకు యూఎస్ఏ డాలర్ రూపంలో లాభాలు వస్తాయని నమ్మించి మోసానికి గురిచేసిన అయిదుగురు వ్యక్తులను ఇటీవల టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల పట్టణంతో పాటు బతదికెపల్లి, తాటిపల్లి తదితర గ్రామాల్లో సైతం ఈ దందా వ్యాప్తి చేసి మోసాలకు గురిచేశారని పోలీసులు గుర్తించారు. రూ. 2,52,000ల పెట్టుబడి పెట్టి మరో అయిదుగురి చేర్పిస్తే లాభాలు వస్తాయని నమ్మించి మోసానికి గురిచేయడంతో సదరు అయిదు గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈవ్యవహారంలో మరికొంత మంది ఉన్నట్లు పోలీసు లు అనుమానిస్తున్నారు.

మోసపూరిత యాప్‌లను నమ్మవద్దు..

వేణుగోపాల్, టౌన్ సీఐ, జగిత్యాల

వెనుకాముందు తెలుసుకోకుండా ఆన్‌లైన్ సంస్థలు-యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోపోవద్దు. ఎవరు కూడా ఊరకే రూ.లక్షల్లో లాభాలను ఇవ్వరన్న విషయాన్ని గ్రహించాలి. చైన్‌లింక్ దందాల్లో చాలామంది అమాయకులే బలవుతున్నారు. ఇప్పటికైనా మేల్కొవాలి. ఇలాంటి ఆన్‌లైన్ బిజినెస్ పెట్టు బడులు పెట్టి కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దు. ఇలాంటి వారు ఎవరైనా మీ వద్దకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

పంచాయతీ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉప్పల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ జగిత్యాల జిల్లా శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే బకాయిలు చెల్లించాలని, లేదంటే పండుగ పూట పంచాయతీ సిబ్బంది వస్తువులు ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. అలాగే గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలకు తెగించి పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బందికి పని భద్రత, శ్రమకు తగిన వేతనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, న్యాతరి మల్లవ్వ, వంగ రాజేశం, గదం అశోక్, రడపాక శంకరయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ శివారులోని తారకరామానగర్ మాజీ సర్పంచ్ కొండ శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ చాంద్ పాషా, సుధాకర్, ఖాసీం తదితరులు ఉన్నారు.

మూసీ సుందరీకరణకు రూ. లక్షా యాభై వేల కోట్లా?

మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్

జగిత్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సర్కారు హయాంలో సు మారు రూ. 97 వేల కోట్ల నిధులను వెచ్చించి రాష్ట్రంలో సుమారు 2.50 లక్షల ఎకరాలను స్థిరీకరణ చేశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 30 కిలో మీటర్ల పరిధిలో ఉండే ముత్యమంతా మూసి నది సుందరీకరణకు రూ. 1,50,000 కోట్లు వ్యయం చేస్తామని అంటుండడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ, మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీపాద ప్రాజెక్టు, కొండ పోచమ్మ, అన్న పూర్ణ, రంగనాయక సాగర్, మిడ్ మానేర్ తదితర ప్రాజెక్టులు, వందల కిలో మీటర్ల కాలువలు నిర్మాణం, నీటి ఎత్తిపోతలను నిర్మించామన్నారు. వాటికి వెచ్చించిన వాటికంటే మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ వెచ్చిస్తున్న నిధులు అధికంగా ఉండడం ప్రజలు గమనించాలన్నారు. దేశంలో తెలంగాణను గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దాలని గులాబీ అధినేత కేసీఆర్ గట్టి పునాదులు వేశారన్నారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని, నష్టాల్లో ఉందని కాంగ్రెస్ పెద్దలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించి కాంగ్రెస్ అధికారం చేపట్టిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమవుతుందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. వచ్చే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామని అన్నారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం


అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోరుట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహాత్మ విద్యానికేతన్‌లో 2000-2001 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణ శివారులోని ముక్క కన్వేన్షన్ హల్‌లో అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డారు. 24 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. తోటి మిత్రుల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత సహకారంతో భజన మందిరాలు

రాయికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కేసీఆర్ హయాంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత సహకారంతో భజన మందిర నిర్మాణాలకు శంకుస్థాపనలు జరిగాయని రాయికల్ బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రాయికల్ పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అప్పటి టీటీడీ బోర్డు మెంబర్‌గా ఉన్న కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శ్రీవారి ట్రస్ట్ ద్వారా రాయికల్ మండలం సింగరావుపేట ఆంజనేయ స్వామి దేవాలయం, కొత్తపేట నాగాలయం, రాయికల్ పట్టణంలోని నాగారం అంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో భజన మందిరాల నిర్మాణాలకు రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షలు కేటాయించారని అన్నారు. వాటికి ఇప్పుడు శంకుస్థాపనలు జరిగి పనులు ప్రారంభం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు రాచమడుగు స్పందనసాగర్ రావు, రాయికల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు బర్కం మల్లేష్, కొల్లూరి వేణు, అల్లీపూర్ మాజీ ఎంపీటీసీ మోర విజయ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ యాదవనేని రాజలింగం, పాల్గొన్నారు.

మండల మున్నూరు కాపు సంఘం కార్యవర్గం


అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

బీర్‌పూర్,అక్టోబరు 20: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చీర్నేని రాజశేఖర్, గౌరవ అధ్యక్షులుగా జెగిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రామకిష్టు గంగాధర్, తాటి గంగాధర్, ప్రధానకార్యదర్శిగా చుక్క జనార్ధన్, కోశాధికారిగా సైండ్ల మల్లేశం, కార్యదర్శులుగా గుర్రతం మల్లేశం, మ్యాడ మల్లేశం, కొల్లురి ప్రభాకర్, సలహాదారులగా మ్యాడ జనార్ధన్, మెండు గంగాధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, బీర్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ హరీష్, అప్పాల జలేందర్, ఎనుగుమట్ల శ్రీనివాస్, చీర్నేని రవిందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 20 : జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీకాంత్ తలకు తీవ్ర గాయాలైనట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల వైపు నుంచి శ్రీకాంత్ అనే యువకుడు తన స్వగ్రామం హబ్సీపూర్ గ్రామానికి తన ద్విచక్రవాహనం పై వెళ్తున్న క్రమంలో ధర్మపురి వైపు నుంచి జగిత్యాల వైపు వస్తున్న కారు శ్రీకాంత్ ప్రయాణిస్తున్న వాహనాన్ని తిప్పన్నపేట సమీపంలో ఢీకొట్టింది. దీంతో యువకుడి తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్సకోసం యువకుడిని కరీంగనర్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయెద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లుల యజమానులు రైతులను ఇబ్బంది పెట్టవద్దని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వర్యంలో నిర్వహించు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం అదనపు తూకం వేయకుండా అధికారులు చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఏ విషయంలోనైనా రైతులకు ఇబ్బందులు కలుగకుండా సంబంధిత అధికారులు చూడాలన్నారు. మండలంలో ప్రతి రైస్‌మిల్లును తనిఖీ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి తరలించి ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు దించుకునే విధంగా చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తప్ప తాలు లేకుండా అధికారులు తూకం వేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఏవో రాంచందర్, డీఆర్‌డీవో పీడీ, డీసీవో మనోజ్‌కుమార్, మార్కెటింగ్ డీఎం, డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఏవో జ్యోతి, ఏపీఎం రాజేష్, ఆర్ఐ కరుణాకర్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, ముత్యం శంకర్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, సింగిల్ విండోల డైరెక్టర్లు, గ్రామాల నాయకులు, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్, ముత్యంరెడ్డి, చంద్రమొహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాల నుంచి ముంబాయికి రైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం లింగంపేట రైల్వేస్టేషన్ నుంచి ముంబాయిలోని దాదర్‌కు రైలును ప్రారంభమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రతి బుధవారం సాయంత్రం 5:46 గంటలకు లింగంపేట రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి గురువారం 1:25 గంటలకు దాదర్‌కు చేరుకుంటుందన్నారు. ఇదే రైలు గురుఎవారం 3:25 నిమిషాలకు దాదాపు బయలుదేరి శుక్రవారం 11:49 గంటలకు జగిత్యాలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

మల్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటలో బజరంగ్ సేన నూతన కార్యవర్గంరు ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పొనగంటి విష్ణువ ర్ధన్, ఉపద్యాక్షులుగా బాలే భగవాన్, గుండేటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పొనగంటి గౌతం రాజ్, కోశాధికారులుగా బలే అనిల్, జగిత్యాల రాజు, కార్యదర్శిగా చింతల తాడేం రాహుల్, మీడియా కన్వీనర్లుగా నేరెళ్ల శ్రీనివాస్, మునిగంటి జలంధర్, ప్రచార కార్యదర్శులుగా సాయితేజ, ఆదర్శ, సోషల్‌మీడియా కన్వీనర్‌గా జగిత్యాల అక్షయ్, సలహాదారులుగా నాగరాజు, రమేశ్, ఉదారపు రమేశ్, రాజు, కార్తీక్, రాజు ఎన్నికయ్యారు.

రాజన్న ఆలయంలో భక్తుల సందడి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బోళా శంకరుడు వేములవాడ రాజరాజేశ్వరస్వామికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన రాజన్న క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పార్వతి పరమేశ్వరులను దర్శించుకొని తరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేం దర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ప ట్టణంలోని సుమాం గళి గార్డెన్స్‌లో పలువురు ప్రైవేటు టీచర్లు, పట్టభద్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రా నున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పని సరిగా అర్హులందరూ నమోదు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉంటున్న తనను గెలిపిం చాలని అభ్యర్థించారు. ప్రైవే టు టీచర్లకు బీమా సౌకర్యం, కొండగట్టు జెఎన్‌టీయూ అటానమస్‌గా మార్పు చేయిం చడం, ప్రైవేటు పాఠశాలలు, కళాశా లల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి అవస ర మైన కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో పలు వురు ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠ శాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, ప్రయి వేటు టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

యథేచ్ఛగా గ్రామాల్లో ఇసుక వేలం పాటలు..?

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో ఇసుక అక్రమ వ్యాపారం మళ్లీ జోరందుకుంది. అక్రమంగా వాగులు, చెరువుల, వరుద కాలు వల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ వ్యాపారస్థులు వేలం పాటల్లో దక్కించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత వర్షకాలంలో వాగులు, వరుద కాలువల్లో ఇసుక మేటలు పెరగడంతో ఇసుక తవ్వకాలు, ఉపందుకున్నాయి. ఇసుకను అక్రమంగా తరలించడానికి గ్రా మంలో లక్షల రూపాలను వేలం పాటలు నిర్వహించినా అధికారులు పట్టించుకోకపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మండలంలోని ఓ గ్రామం నుంచి ఇసుకను తరలించడానికి లక్షల్లో వేలం పాటలో కొందరు అక్రమ వ్యాపారస్తులు దక్కించుకున్నట్లు అలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో వాగులు, వరుద కాలువ పక్కన వున్న గ్రామాల్లో ఇసుక వేలం పాటలు నిర్వహించినప్పటికీ, అధికారులు అరికట్టడంలో విఫలమవడంతో అక్రమ వ్యాపారం మళ్లీ ఊపందుకోనుంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

బుగ్గారం, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ బుగ్గారం గ్రామాలలో పలు కారణాలతో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఆదివారం విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వారి కుటుంబాలను పరామర్శించాడు. సిరికొండ గ్రామంలో డెంగ్యూ జ్వరంతో మృతి చెందిన బీజేపీ నాయకుడు పంచిత లక్ష్మణ్,బుగ్గారంలో అనారోగ్యంతో మృతి చెందిన విలాసాగరపు రవి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొడిమ్యాల రాజన్న పాల్గొన్నారు.

పీఈటీ జిల్లా టాపర్‌కు సన్మానం

గొల్లపల్లి, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాలలో పీఈటీ జిల్లా టాపర్‌గా నిలిచిన గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన అంకం శేఖర్‌ను పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. శేఖర్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే డీఎస్సీకి ప్రిపేర్ అవ్వగా గత నెలలో విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పిఇటీ జిల్లా టాపర్గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు చౌటపెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి అందే లక్ష్మణ్, కోశాధికారి అంకం లింబాద్రి, మండల ప్రధాన కార్యదర్శి అంకం భూమయ్య, పట్టణ ఉపాధ్యక్షులు ఎలగందుల శంకర్, యువత అధ్యక్షులు అంకం రవి, సభ్యులు పాల్గొన్నారు.

భగవంతుడి ఆశీస్సులతో లోక కల్యాణం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భగవంతుడి ఆశీస్సులతోనే లోక కల్యాణం జరగాలని వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వేణుగోపాల స్వామివారి ఆల యంలో బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనములు ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేముల వాడ పట్టణంలో శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనములు ఏడు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమన్నారు.